రిసార్ట్స్ అక్రమ నిర్మాణం నిలుపుదల

ప్రజాశక్తి-అరకులోయ: మండలంలోని చిన్న లబుడు పంచాయతీ హట్టగూడ గ్రామ సమీపంలో జరుగుతున్న అక్రమ బినామీ రిసార్ట్స్ నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీ అధికారులు నిలిపివేశారు. హట్టగూడలో బినామీ పేరుతో భారీ రిసార్ట్స్ నిర్మాణంపై అధికారులకు గిరిజనులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు చినలబుడు పంచాయితీ కార్యదర్శి కె. గురుమూర్తితో మాట్లాడి తక్షణమే నోటీసును జారీ చేసి పనులు నిలిపి వేయవలసిందిగా ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి గురుమూర్తి రిసార్ట్స్ యజమానికు నోటీసులు జారీ చేశారు. నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని, ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

హట్టగూడలో రిసార్ట్స్

ఇంకా విషమంగానే...

-విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స- కెజిహెచ్‌లో 24 మంది చేరిక

విశాఖలో కిమ్స్‌లో బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-యంత్రాంగం

కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో మంగళవారం వైద్యులు చికిత్స అందిస్తున్నారు. విశాఖ కెజిహెచ్‌లో 38 మంది, నర్సీపట్నంలో 22 మంది, పాడేరులో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

విశాఖ కలెక్టరేట్ : అస్వస్థతకు గురైన చిన్నారులలో సోమవారం 14 మంది కెజిహెచ్‌కు రాగా మంగళవారం 24 మంది విద్యార్థులు వచ్చి చేరారు. దీంతో మొత్తం బాధితుల సంఖ్య 38 కి చేరింది. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురి పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండడంతో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. విషమంగా ఉన్న ఐదుగురికి కెజిహెచ్‌లోనే అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మీడియాకు తెలిపారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న 22 మంది పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అనకాపల్లి జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వీర జ్యోతి మంగళవారం మీడియాకు తెలిపారు. పూర్తిగా కోలుకున్నాక వారిని ఇంటికి పంపిస్తామని చెప్పారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శిరీష పరిస్థితిని సమీక్షిస్తున్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న చిన్నారుల్లో పాగి.అనురాధ, వంతల గౌతం, మారి అలేఖ్య, వంతల శైలి, తబిటి రాము, సైది లక్ష్మి, పాగి శాంతిశ్రీ, బొరడ జ్యోతి, తంబలి శ్రీను, సందరి డేవిడ్, తంబలి నందిని, ఎస్ కుమారి, పాగి లలిత, పాగి మేరి, వంతల సత్యం, పాగి అరవింద్, ఎస్.అనంత్, సంధ్య రవి, వంతల సంధ్య, పాగి అంజలి, పాగి శివాజీ, పాగి జగన్ తదితరులు ఉన్నారు.

పాడేరు : పాడేరు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎనిమిది మందిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ విశాఖ తరలించారు. మెడికవర్ ఆసుపత్రికి ముగ్గురిని, కిమ్స్‌కు ఇద్దరిని, రెయిన్‌బోకు ఒకరిని తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

మెరుగైన వైద్యం: రామగిడ్డయ్య

కోటవురట్ల : నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ రామగిడ్డయ్య, నర్సీపట్నం ఆర్‌డిఒ జయరామ్ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిహెచ్‌సి సిబ్బందిని ఆదేశించారు. ఘటన చాలా బాధాకరమని, కేవలం నిర్వాహకుని నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు రామగిడ్డయ్య తెలిపారు. సమగ్ర విచారణ చేపడుతున్నామన్నారు.

కొనసాగుతున్న విచారణ

ఘటనపై రెవెన్యూ, పోలీస్ అధికారుల విచారణ కొనసాగిస్తున్నారు. నిర్వాహకునిపై బిఎన్ఎస్ 105 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు సిఐ అప్పన్న తెలిపారు. నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను చోడవరం మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా రిమాండ్ విధించారని, అతనిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. నిర్వాహకుని బ్యాంకు అకౌంట్లు సీజ్ చేసినట్లు చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఆశ్రమం ఏర్పాటు చేయడం, నిర్వాహకుడు చెబుతున్న విద్యార్థుల సంఖ్యకు ఆశ్రమం పొందుతున్న విద్యార్థుల సంఖ్యకు తేడాపై ఆరాతీస్తున్నట్లు వివరించారు.

కోటవురట్లలో అనాథశ్రమంలో తనిఖీ చేపడుతున్న అధికారులు

నర్సీపట్నంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

పలువురి పరామర్శ

విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు చిన్న పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న బాలలను పరామర్శించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బాలలకు సరైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

కెజిహెచ్ పిడియాట్రిక్స్ వార్డులో చికిత్స పొందుతున్న పిల్లలను, వారి తల్లిదండ్రులను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పరామర్శించారు. వారికి అందిస్తున్న వైద్య సదుపాయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తిలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధ ప్రాతిపదిక చికిత్సతో పాటు మరింత మెరుగైన వైద్యం కోసం ముగ్గురు పిల్లలను నగరంలోని ఇతర ఆసుపత్రుల్లో చేర్పినట్టు వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కోటవురట్ల స్థానిక అధికారులపై క్రమ శిక్షణా చర్యలు చేపట్టేలా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్నట్టు తెలిపారు. పిల్లలను పరామర్శించిన వారిలో ఐసిడిఎస్ జిల్లా ప్రోజెక్ట్ డైరెక్టర్ జయదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎంఆర్ఎల్.రాధ, సభ్యులు లక్ష్మి, ఎం.రజని, సూర్యనారాయణ,విజయలక్ష్మి, సిడిపిఒ శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, పిఒఐ సి.రమేష్, కెజిహెచ్ ఒన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య తదితరులున్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రణాళికలు తయారు చేసి సమర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాలులో వ్యవసాయ, పశుసంవర్ధక, హార్టికల్చరల్ శాఖల, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులతో పిఒ సింహాచలం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన రైతులకు ఈ క్రాపింగ్ బుకింగ్‌తో పాటు పంటల బీమా చేయాలని సూచించారు. గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేసినట్లు చెప్పారు. గిరిజన రైతులకు పిఎం కిసాన్ క్రెడిట్ కార్డులు ఎంతమందికి ఉన్నాయో, ఈ ఏడాది ఎన్ని ఎకరాలలో రైతులు వరి, పత్తి, వివిధ పప్పు దినుసులు సాగు చేస్తున్నారో ఆరా తీశారు. పశువులకు వ్యాధులు రాకుండా 100శాతం టీకాలు వేయాలని ఆదేశించారు. గోకుల పథకం ద్వారా పశువుల షెడ్లు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలన్నారు. పశువులకు జియో టాకింగ్ చేయాలన్నారు. హార్టికల్చర్ ద్వారా జీడిమామిడి, ఇతర పండ్ల మొక్కలు ఎన్ని సరఫరా చేశారు, ఎన్ని ఎకరాల్లో సాగు చేశారో అడిగి తెలుసుకున్నారు. గిరిజన రైతులు పండించే పంటను కోతులు పాడు చేస్తున్న కారణంగా రైతులకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఈసమావేశంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, పీహెచ్‌ఓ చిట్టిబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్ కెవి.చౌదరి, సావిత్రి, మండల వ్యవసాయ శాఖ అధికారులు కె.లక్ష్మణ్, విశ్వనాథ్ కెవికె, సీనియర్ శాస్త్రవేత్తలు ఆదర్శ, వీరాంజనేయులు, ఎఫ్‌డిఒ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శేషారెడ్డి

ప్రజాశక్తి- రంపచోడవరం

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శేషారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కూనవరం సిహెచ్‌సిలో డాక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి, ఆసుపత్రి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

డాక్టర్ శేషారెడ్డి

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ రావు

ప్రజాశక్తి-పాడేరు: 2024-2025 విద్యా సవంత్సరం లో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష (ఎన్ ఎం ఎం ఎస్)కు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ రావు తెలిపారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాదమికోన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ పరీక్ష డిసెంబర్ 12న జరుగుతుందన్నారు. పరీక్ష రుసుము ఓసి, బిసి విద్యార్థులకు రూ.100, యస్.సి, యస్.టి విద్యార్థులకు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని, దరఖాస్తులను ఆన్ లైన్‌లో స్వీకరిస్తున్నారని, చివరి తేదీ సెప్టెంబర్ 9 అని తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డ్ లో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు.పూర్తి వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్సైటు లేదా జిల్లా కేంద్రం పాడేరులో ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం లో సంప్రదించాలని డిఇఒ తెలిపారు.

విద్యార్థితో చదివిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

-ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: విద్యార్థులు ఉపాధ్యాయులతో క్రమశిక్షణగా మెలగాలని స్థానిక అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్ సబ్జెక్టును చదివించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టి సారించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టుల వారిగా తరగతులు బోధించిన తర్వాత వాటిపై సాయంత్రం పూట ప్రత్యేకంగా హోంవర్క్ చేయించే విధంగా చూడాలన్నారు. అనంతరం పాఠశాల వసతి గృహంలోని స్టాక్ రూమ్ ను పరిశీలించి విద్యార్థులకు పెడుతున్న భోజనం మెనూకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న భోజనం సక్రమంగా అమలు చేయాలని ఆయన ప్రధాన ఉపాధ్యాయురాలు సునీత, డిప్యూటీ మెట్రిన్ భారతిను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరావు, వైసీపీ నేతలు భవిత, పాపారావు, గణపతి పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పిలకు షోకాజ్ నోటీసుల జారీ దుర్మార్గం

సిఐటియు

ప్రజాశక్తి-పాడేరు: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు అల్లూరు జిల్లాలో జరిగిన నిరసన కార్యక్రమంలో 33 మంది ఎం.ఎల్. హెచ్ పి లు పాల్గొన్నందుకు అల్లూరి జిల్లా డి ఎం హెచ్ ఓ డాక్టర్ జమాల్ భాష వీరికి షోకాజ్ నోటీస్ జారీ చేయడం దుర్మార్గమని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. తక్షణం షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సంఘటన తీవ్రంగా ఖండించి పెద్ద ఎత్తున నిరసనలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారన్నారు. ఇటీవలే మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వంలో ప్రశ్నించే హక్కు, నిరసన తెలిపే హక్కు ఉంటుందని తెలిపారని గుర్తు చేశారు. మరి ఈ షోకాజ్ నోటీసు పట్ల తక్షణ మంత్రి లోకేష్ స్పందించి జారీ చేసిన డి ఎం హెచ్ ఓ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు.అప్పుడే మంత్రి లోకేష్ ప్రకటనకు విలువ ఉంటుందన్నారు. డి ఎం హెచ్ ఓ ఇచ్చిన షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోకపోతే ఉద్యోగ సంఘాలు, మహిళా సంఘాలతో కలిపి ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు...

విద్యుత్ సమస్యపై నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండలంలోని నాన్ షెడ్యూల్ మారుమూల రొంపల్లి పంచాయతీ పరిధి చిన్నకోన్నల, బూరుగ కొండ శిఖారు గ్రామాలకు చెందిన గిరిజనులు మంగళవారం కాగడాలతో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ, తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం అనేక పోరాటాలు చేపట్టిందని తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేక రాత్రుల పూట తామంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు

చదువు చెప్పే నాధులేరి?

కొమ్ములవాడ, పెట్రాయి పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించని వైనం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ కొమ్ములవాడ, దారకొండ పంచాయతీ పెట్రాయి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు చదువు చెప్పే ఉపాధ్యాయులు లేరు. దీంతో తమ పిల్లలు చదువు అటకెక్కే పరిస్థితి దాపురించిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొమ్ములవాడ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 50 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం డిప్యూటేషన్‌పై ఒక ఉపాధ్యాయుని కొమ్ములవాడ పాఠశాల నియమించినప్పటికీ అనంతరం బదిలీపై వేరొక చోటికి వెళ్లిపోయారు. దీంతో ఈ పాఠశాలకు పది రోజుల నుంచి ఉపాధ్యాయులు రావడం లేదు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి బిక్కముఖాలు వేసుకొని కూర్చుంటున్నారు. పాఠాలు చెప్పే నాధుడే కరువయ్యారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలు పశువులు కాపర్లుగా మారి విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు. పెట్రాయి ఎంపీపీ పాఠశాలలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఉపాధ్యాయులు లేకుండా తమ పిల్లలు చదువులు ఎలా అభ్యసిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటికైనా పెట్రాయి, కొమ్ములవాడ ఎంపీపీ స్కూళ్లకు ఉపాధ్యాయులను తక్షణమే నియమించే విధంగా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎంఇఒ మాడి రామన్న వివరణ

పెట్రాయి, కొమ్ములవాడ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంపై జీకే వీధి ఎంఈఓ మాడి రామన్నను వివరణ కోరగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఇటీవల కాలంలో బదిలీ అయ్యారని, వారి స్థానంలో వేరే ఉపాధ్యాయులను ప్రభుత్వం ఇంకా నియమించలేదని పేర్కొన్నారు. మరో రెండు మూడు రోజుల్లో ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్న పాఠశాలలకు సిఆర్‌టిలను ప్రభుత్వం నియమించడానికి చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రభుత్వం సిఆర్‌టిలను కొత్తగా నియమించిన వెంటనే ఆయా పాఠశాలలకు పంపించడం జరుగుతుందని చెప్పారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీలు

పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి టి.తులసి సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం శ్రీ కృష్ణాపురం జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలికల పాఠశాల బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రపంచ దోమల నివారణ దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. దోమల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, వారణకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమాజమే లక్ష్యంగా పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారులు డి.శేషయ్య, ఎజె సత్యనారాయణ, హెచ్‌ఎం ఎం.మంజుల, హెచ్‌ఎ బి.ఎలీషారావు, పారామెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అడిషనల్ డిఎంహెచ్‌ఓ శిరీష మండలంలోని హాస్టళ్లు, పాఠశాలలో పర్యటించి దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి, వాటిని నివారించే చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1897 ఆగస్టు 20న డాక్టర్ రొనాల్ రాజ్ బ్రిటిష్ శాస్త్రవేత్త ఆడ అనాఫిలస్ అను దోమ ద్వారా మలేరియా వ్యాధి వస్తుందని ప్రపంచానికి తెలియజేసినారని అందుకు ఆయన గౌరవార్థం ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శ్రీనివాసరాజు ఏఎంఓ ఎం.చంటిబాబు డిసి, ఎంటిఎస్, ఎంపీహెచ్‌ఎ, ఏఎన్‌ఎం, ఎంఎన్‌హెచ్‌పి , ఆశాలు పాల్గొన్నారు.

కూనవరం : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పెరగకుండా, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రాజీవ్, సూపర్ వైజర్ శ్రీనివాస్, వెంకటేష్, రత్తయ్య, ఏ.ఎన్.ఎంలు, ఆశా కార్యకర్తలు, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కూనవరంలో...

వంట గదిలో తనిఖీలు చేస్తున్న మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బాబు

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి.బాబు స్థానిక కస్తూరిభా గాంధీ బాలిక విద్యాలయం, ఇరలపల్లి జూనియర్ కళాశాలల్లో మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల చదువు, ఉపాధ్యాయుల పనితీరును, లోటు పాట్లను తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను ఆరా తీశారు. హాస్టల్ వసతులను, మరుగుదొడ్లను పరిశీలించి అపరిశుభ్రమైన పరిసరాలు, బాలికలకు పెడుతున్న ఆహారం, గదులు, డైనింగ్ హాల్, డారెమటరీ, ఫ్యాన్‌లు, ఎయన్యమ్ మొదలైన వాటిన పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పట్ల తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కోసం పాఠశాల యాజమాన్యానికి ఉందని స్పష్టం చేశారు. బాలికలకు కావాల్సిన మౌలిక వసతుల పట్ల అశ్రద్ధ తగదని హితవుపలికారు. మండల న్యాయసేవాదికార సంస్థ ప్రత్యేకతను తెలియజేసి, విద్యార్థుల సమస్యల కోసం లీగల్ సర్వీస్ టోల్ ఫ్రీ నెంబరు 15100కు కాల్ చేస్తే సరైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వై.శ్రీనివాస్, సంతోష్ కుమార్, కోర్టు సూపరింటెండెంట్ నాగ భూషణం తదితరుల పాల్గొన్నారు.

బేస్ లైన్ టెస్టుపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-సీలేరు : విద్యార్థులకు నిర్వహించనున్న బేస్ లైన్ టెస్ట్‌పై స్కూల్ కాంప్లెక్స్ పరిధి దారకొండ బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీకే వీధి ఎంఈఓ -2 మాడి రామన్న మాట్లాడుతూ సీలేరు, దారకొండ, సప్పర్ల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్, యుపి స్కూల్ ప్రధానోపాధ్యాయులతో ఈ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు రాయడం, చదవడం, విద్యలో రాణింపుపై చర్చించినట్లు తెలిపారు. విద్యార్థులను విద్యలో ఏ విధంగా తీర్చిదిద్దాల అనే అంశంపై విసిదికరించడం జరిగిందన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రతిభ పాఠాల్లో తర్ఫీదు ఇచ్చి అనంతరం 23న బేస్ లైన్ టెస్ట్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు ఏఏ గ్రేడ్లు వచ్చాయో, వారి భవితవ్యం ఏ విధంగా ఉందో క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం తుది నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దారకొండ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం హేమచంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ-2 రామన్న

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

పిల్లలను ఉన్నతంగా చదివించండి

- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-అరకులోయ :గిరిపుత్రులను ఉన్నతంగా చదివించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. అరకు వ్యాలీ మండలం బొండం పంచాయతీ రేగ గ్రామంలో ఎంపీ లాడ్స్ రు.8.50 లక్షల నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలే విద్యార్థుల భవిష్యత్తు అని అన్నారు. కైలాస పట్నంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని అన్నారు. చిన్న పిల్లలను ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ పాఠశాలలకు పంపించాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక విద్యా సదుపాయాలు కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె. వేణుగోపాల్, ఏఈ అభిషేక్, ఎంఈఓ భారతీరత్నం, బొండం గ్రామ సర్పంచ్ డి.భాస్కరరావు, వార్డ్ మెంబర్ శంకర్రావు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రజాశక్తి-అరకు లోయ :ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మక ఆర్ఇన్ బ్యాంక్ డెలిగేట్ ఎన్నికలలో ఘనవిజయం సాధించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ అరకు బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం అరకు పట్టణంలో విజయోత్సవ సభను నిర్వహించారు. అరకు రైల్వే ఇన్స్టిట్యూట్లో జరిగిన ఈ సభకు ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామ మోహన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రామిక్ కాంగ్రెస్ పూర్వ బ్రాంచ్ బాబు రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో అరకు రైల్వే ఇన్స్టిట్యూట్ కార్యదర్శి డి.వెంకటరావు, ఇన్స్టిట్యూట్ కార్యవర్గ సభ్యులు పి.రామారావు, నాగరాజు, శ్రామిక్ కాంగ్రెస్ పూర్వ బ్రాంచ్ కోశాధికారి విష్ణు ప్రసాద్, బ్రాంచ్ నాయకులు వై.ప్రసాదరావు, సతీష్, గణపతి రావుల నాయకత్వంలో శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ పి..రామ మోహనరావు కండువా వేసి ఆహ్వానించారు. అరకు ఇంజనీరింగ్ ఏడిఇ ఎన్ దిలీప్ కుమార్ మద్దతును తెలియజేశారు.

పంటలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రత్యక్ష అనుభవాలతో కూడిన విద్యను అందించేందుకు గాను పంటల సాగుపై ఉపాధ్యాయులు మొన్న సత్యారావు విద్యార్థులకు పొలాల్లో అవగాహన కల్పించారు. సుభద్రపల్లి పంచాయతీ మత్స్యపురం ఎం.పి.పి పాఠశాల విద్యార్థులను పంట పొలాల్లో తీసుకువెళ్లి పంటలు ఏ విధంగా పండిస్తారో ప్రత్యక్షంగా చూపిస్తు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనంలో మేధాశక్తి పదును పెట్టేందుకు ఇటువంటి బోధనలతో వీలు కలుగుతుందని ఆయన అన్నారు.

పంటలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు...

రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి

అరకులోయరూరల్: విషాహారం తిని అనకాపల్లి జిల్లా కోటవురట్ల అనాధాశ్రమంలో ఆదివాసీ విద్యార్థులు మృతి చెందటం పట్ల ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాగిన ధర్మానపడాల్, పొద్దు బాలదేవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.అస్వస్థత కు గురై చికిత్స తీసుకుంటున్న వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్గ్రేషియో చెల్లించి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని వైద్యం పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

అనంతగిరి:విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం అనాథ ఆశ్రమంలో మృతి చెందిన ముగ్గురు చిన్నారుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 50 లక్షలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

డుంబ్రిగుడ: విషాహారం తిని అనకాపల్లి జిల్లా కోటవురట్ల అనాధాశ్రమంలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మైదాన ప్రాంతం అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాస పట్నంలో క్రిస్టియన్ చర్చ్ ఆధ్వర్యంలో నడుపుతున్న అనాథ పాఠశాల గృహంలో ఉంటూ సమీపంలో ఉన్న వివిధ పాఠశాలల్లో గిరి విద్యార్థులు చదువు తున్నారన్నారు. అస్వస్థత కు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి, ఈ సంఘటనకు కారకులైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి పాపారావు, బలరాం, సిహెచ్ లోకనాథం, కె.దనేష్ పాల్గొన్నారు.

పాడేరు : అనాధాశ్రమంలో మృతి చెందిన ముగ్గురు గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలికి లక్కు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు.

అనధికార వసతి గృహాలపై చర్యలు

- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతంలో అనధికారకంగా నిర్వహిస్తున్న వసతి గహాలపై చర్యలు తీసుకుంటామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ స్పష్టం చేశారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం ప్రైవేటు వసతి గహంలో కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురై కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న చిన్నారులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలుషిత ఆహారం తిని అనంతరం స్వగ్రామాలకు వెళ్లిపోవడం వలన ఐటీడీఏలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అందర్నీ గుర్తించి ఆసుపత్రులకు తరలించడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏజెన్సీలో నిర్వహిస్తున్న ప్రైవేటు వసతి గహాలను రిజిస్టర్ చేశారా? లేదా అని గుర్తించి మూసివేతకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనధికార వసతి గహాల ను తనిఖీ చేయడానికి విద్యాశాఖ, ఐ సిడిఎస్ అధికారులతో కమిటీ వేసామని చెప్పారు. చింతపల్లి మండలంలో ఒక ప్రైవేటు వసతి గహాన్ని మూసివేయడం జరిగిందని అన్నారు. అనంతగిరి మండలం కాశీ పట్టణంలో ఒక వసతి గహాన్ని గుర్తించి అక్కడున్న చిన్నారులను ప్రభుత్వ ఆశ్రమం పాఠశాలలకు తరలిస్తున్నామని చెప్పారు. అస్వస్థత కు గురైన చిన్నారులలో ఏడుగురిని ప్రైవేట్ ఆస్పత్రిలోనూ 20 మందిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలోనూ, 38 మందిని కేజీహెచ్ లోను చేర్పించి చికిత్స అందిస్తున్నామన్నారు. పాడేరు జనరల్ ఆస్పత్రిలో ఎనిమిది మంది చికిత్స పొందుతున్నారని చెప్పారు. మతి చెందిన ముగ్గురు చిన్నారులు తమ దష్టికి రాకపోవడం వల్ల మతి చెందారని అన్నారు. మతి చెందిన చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్గ్రేషియా ప్రకటించిందని చెప్పారు . అస్వస్థత కు గురైన చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఇప్పటికే కొంతమంది కోరుకున్నారని చెప్పారు. అందరూ కోలుకున్నాక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తామన్నారు. తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక ప్రైవేట్ వసతి గహాలకు పంపిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ కొండలరావు, ఎస్ డి సి శర్మ తదితరులు పాల్గొన్నారు.

మిషనరీ హాస్టల్ను తనిఖీ చేసిన పిఒ

అనంతగిరి:మండలంలోని కాశీపట్నం పంచాయతీ గ్రామంలో హెూలీ స్పిరిట్ మిషనరీ పాఠశాల హాస్టల్ను ఐటిడిఏ పిఒ అభిషేక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అందుతున్న విద్యా బోధనపై ఆరా తీశారు. ఈ పాఠశాలలో చదువుతున్న 37 మంది విద్యార్థులను అందుబాటులో ఉన్న ఆశ్రమ పాఠశాలలకు తరలించాలని మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూ వెంకటరమణ, ఎంఈఓ బాలాజీ, ఎంపీడీవో నగేష్, ఎస్సై కె రాము పాల్గొన్నారు.

హైదరాబాద్ - కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి హైదరాబాద్ - కటక్ - హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 07165 హైదరాబాద్ -కటక్ ప్రత్యేక రైలు ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 17 వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, అదేరోజు సాయత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్ - హైదరాబాద్ ఈ నెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 18 వరకు ప్రతి బుధవారమూ రాత్రి 22:30 గంటలకు కటక్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:35 గంటలకు దువ్వాడ, అదేరోజు రాత్రి 21:00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బెర్హామ్పూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, మీదుగా ప్రయాణిస్తాయి.

నేరాలు ఘోరాలు

160 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-జి.మాడుగుల: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి తరలిస్తున్న 160 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పాడేరు ఏఎస్పి.ధీరజ్ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో ఉరుము కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. చింతపల్లి వైపు నుంచి వస్తున్న ఆటోను తనిఖీ చేయగా నాలుగు గున్ని బ్యాగులలో 160 కిలోలు గంజాయిని ఉన్నట్టు గుర్తించారు. రవాణా చేస్తున్న ఇద్దరి నిందితులకు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఆటో, రెండు సెల్ఫోన్లను సీజ్ చేశారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను త్వరలో పట్టుకొని అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐ రమేష్ పాల్గొన్నారు.

గంజాయి నిందితులతో పోలీసులు

అవగాహన కల్పిస్తున్న సిఆర్పిఎఫ్ సిబ్బంది

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- పెదబయలు:ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలని సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ త్రిలోచన్ బేరా తెలిపారు. ౨ మండలంలోని రూడకోట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమాండెంట్ త్రిలోచన్ బేరతో పాటు సిబ్బంది పాఠశాల పరిసరాలలో మొక్కలు నాటారు. అనంతరం కమాండెంట్ మాట్లాడుతూ.. ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్టాండ్, వారపు సంత పరిసరాలలో సుమారు 2000 వేల వరకు మొక్కలు నాటడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ దేవ్ సింగ్, కానిస్టేబుల్ ఎస్.కె.అల్లా, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కె.దేముడు పాల్గొన్నారు.

రాజ్మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- డుంబ్రిగుడ:గిరి రైతులకు ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో అందిస్తున్న రాజ్మా విత్తనాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఏడి మోహన్రావు ఆధ్వర్యంలో సబ్సిడీతో మంజూరైన విత్తనాలను పంపిణీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే విత్తనాలను బయట విక్రయించకుండా ప్రతి ఒక్క రైతులు పండించుకుని ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. ప్రభుత్వం అందించే రైతు విత్తనాలపై అధికారులు కూడా సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకుని వాటి వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించే విధంగా చూడాలని చెప్పారు. ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ వ్యవసాయ అభివృద్ధికి సిబ్బంది తోడ్పాటు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జడ్పిటిసి బి.ఈశ్వరి, సిహెచ్ జానికమ్మ, అరకులోయ జడ్పిటిసి ఎస్ రోషిని, వైస్ ఎంపీపీలు ఎస్ ఆనంద్, పి లలిత, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి, సర్పంచ్ పి.వెంకట్రావు, మండల వ్యవసాయ అధికారిని నీలవేణి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తే సహించం

టిడిపి నేత సమక్షంలో నోటీసులు చూపుతున్న పార్వతీనగర్ వాసులు

ప్రజాశక్తి -సీలేరు : వైసీపీ ప్రభావంలో ఉన్న అధికారులు తమ తీరు మార్చుకోకుండా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని టిడిపి అరుకు పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి నక్క తిరుమలరావు హెచ్చరించారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ జీకే వీధి మండలం సీలేరులో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నూతనంగా నిర్మించడానికి గతేడాది ప్రజా అభిప్రాయ సేకరణ అధికారులు చేపట్టారని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల ఇక్కడ ప్రజలకు ఎటువంటి నష్టం జరగదని, ఒకవేళ నష్టం జరిగితే అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఉన్నతాధికారులు, ఏపీ జెన్కో అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారులు ఇచ్చిన హామీలు నిలబెట్టుకొని స్థానిక ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేనున్నట్లు చెప్పారు. సీలేరు పంచాయతీ పరిధి పార్వతినగర్లో నివాసముంటున్న పివిటిసిలను అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తూ ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే శిరీషాదేవికి సమస్యలను విన్నవిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-రంపచోడవరం : నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మంగళవారం ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కరించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు బదిలీల కొరకు ఎమ్మెల్యే శిరీష దేవికి వినతులు అందించారు. దేవీపట్నం మండలం గండి పోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి ఎమ్మెల్యే భాగస్వామ్యం ఉండాలని ఆలయ ఈవో గండే లక్ష్మి కూమార్ మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఆలయ అర్చకులు, వెంకన్న దొర, దేవీపట్నం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు మధుసూదన్, రామకృష్ణ మహిళా ఉపాధ్యక్షురాలు కారం పోసమ్మ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

ప్రజాశక్తి-మధురవాడ : విజయవాడ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇండిపెండెన్సడే పరేడ్లో ఆర్మ్డ్ కంటిజెంట్గా విశాఖపట్నంలోని 16వ బెటాలియన్ మొదటి బహుమతి సాధించడంపై హర్షం వ్యక్తమౌతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా రూ. 20 వేలు నగదుతో పాటు ట్రోఫీని అందుకున్న బృందాన్ని మంగళవారం బెటాలియన్లో ఇన్ఛార్జి కమాండెంట్ సిహెచ్వీఎస్.పద్మనాభరాజు, అభినందించారు. రాష్ట్రస్థాయి మొదటి బహుమతిగా సాధించిన నగదు రివార్డును పరేడ్లో పాల్గొన్న సభ్యులందరికీ స్వయంగా పంపిణీ చేశారు

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి

ప్రజాశక్తి-గంగవరం, రంపచోడరం : ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గంగవరం మండలం వేములోవ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆయన ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ముందుగా విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో విద్యను బోధిస్తున్నదీ లేనిదిక్లాస్ రూములకు వెళ్లి ప్రాజెక్ట్ అధికారి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ విద్యార్థులకు టైం టేబుల్ ప్రకారం ఎప్పటికప్పుడు వివిధ సబ్జెక్టులు ఉపాధ్యాయులు చెప్పాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో పాస్ అవ్వాలని కోరారు. విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎవరికైనా అనారోగ్యంగా ఉన్న ఎడల వెంటనే స్పందించి దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తీసుకుని వెళ్లి వైద్యం చేయించాలని సంబంధిత అధికారులను పిఒ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మెనూ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తహాశీల్దారు సిహెచ్. శ్రీనివాసరావు, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, సిడిపిఒ లక్ష్మి, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న పిఒ

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

హుకుంపేట, విఆర్.పురంలో పశువకుల వ్యాక్సినేషన్ చేస్తున్న వెటర్నరీ వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో పలుచోట్ల జాతీయ పశు వ్యాధి నివారణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశామని పశువైద్యాధికారిని ఎం.సౌజన్యదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ నుండి సెప్టెంబర్ 18 వ తేదీ వరకు టీకాలను వివిధ పంచాయితీల్లో వేస్తామన్నారు. గాలికుంటు వ్యాధి లక్షణాలు ఉన్న పశువులలో తీవ్రమైన జ్వరం, నీరసం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు కలిగిన పశువులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే మృతి చెందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు యమునా, బుచ్చిరాజు , రమేష్ , వెంకట్, అప్పలరాజు , రామ్ నాయుడు, రఘునాథ్ పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను నాలుగు గ్రామాల్లో 600 పశువులకు వేయించడం జరిగిందని పశు వైద్యాధికారి డీకే చరణ్ మంగళవారం పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పశువులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు రైతులు పాటించాలని ఆయన సూచించారు. రోగాలు వచ్చినప్పుడు దగ్గరలో ఉన్న పశు వైద్య ఆసుపత్రికి సందర్శించి మందులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో జీఎం కొత్తూరు, వైబి గొందూరు గ్రామాలలో మంగళవారం మండల పశు వైద్య అధికారి సృజనకుమారి, బంధవీధిలో పశువైద్యాధికారి కుసుమ ప్రియ దర్శిని ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంట వ్యాధి నిరోధక టీకాలను వేశారు రెండు గ్రామాల్లో కలిపి 377 పశువులకు టీకాలను వేసామన్నారు.

విఆర్.పురం: మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెం గ్రామంలో మండల పశు వైద్య అధికారిని రాజేశ్వరి ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ పూనెం సరోజినీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేఖపల్లి గొల్లగూడెంలో పశు సంపద ఎక్కువగా ఉందని, ఇటీవల గోదావరి వరదలు వలన పశువులకు, గొర్రెలు, మేకలకు రోగాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిఆపారు. వాటి నివారించేందుకు పశు వైద్యాధికారులు నిత్యం పర్యవేక్షణ ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి.శ్రీను, సరిహద్దు రాజేశ్వరరావు, కుంచం శ్రీను, వెటర్నరీ డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అడ్డతీగల : స్థానిక డొక్కపాలెం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు చెదల బాలిరెడ్డి అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందగా, శ్రీవినాయక తాపీ పనివారి సంక్షేమ సంఘం తరుపున మట్టి ఖర్చులు నిమిత్తం రూ.5000 ఆర్థిక సాయం మృతుని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గుల్లల సురేష్బాబు, చింతాజీ అబ్బులు, లింగం పెద్దబాబు, నెంబం౹ అప్పారావు, కన్నబాబు, రాజు, సత్తిబాబు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న తాపీ మేస్త్రీల సంఘం ప్రతినిధులు

కండ్ల కలకకు చికిత్సపై అవగాహన

- ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి - ఆరిలోవ : కండ్లకలక అనేది అవగాహన చికిత్స అని, కండ్ల కలకకు వైరస్, బ్యాక్టీరియా, అలర్జీలు అనేవి ప్రధాన కారణమని ఎల్వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ హిమబిందు అన్నారు. కండ్ల కలక అంటు వ్యాధి అని, వ్యాధి లక్షణాలను బట్టి చికిత్సా విధానం ఉంటుందన్నారు. వ్యాధి లక్షణాలు బట్టి కండ్ల కలకను మూడు రకాలుగా విభజిస్తారన్నారు. వైరల్ కండ్ల కలక సాధారణ జలుబు సంబంధమైనదని, అడెనోవైరస్ వలన వస్తుంది. దీన్ని తీవ్రమైన అంటు వ్యాధిగా పరిగణిస్తారన్నారు. రెండవది బ్యాక్టరియా కండ్ల కలక. స్టెఫిలోకాకస్ అరియస్ వంటి బ్యాక్టీరియా వలన వస్తుందన్నారు. ఈ వ్యాధి గల వారిని నేరుగా కలిస్తే ఇతరులకు త్వరితంగానే వ్యాపిస్తుందన్నారు. మూడవది అలెర్జీ కండ్ల కలక. ఇది పుప్పొడి, దుమ్ము, ధూళి, చుండ్రు వంటి అలెర్జీ కారణాలతో వస్తుందన్నారు. కండ్ల కలక వ్యాప్తిని నివారించేందుకు పరిశుభ్రత చాలా అవసరమని, సబ్బు నీటితో క్రమం తప్పకుండా చేతులు కడగడం వల్ల ఇన్ఫెక్షన్ వ్యాప్తిని నిరోధించవచ్చన్నారు. కండ్ల కలక తేలికపాటిదని, దీనిని ఇంటి వద్దే నివారించుకోవచ్చన్నారు. అయితే కొన్ని కండ్లకలక లక్షణాలకు బట్టి నేత్ర వైద్యుని తప్పక సంప్రదించడం అవసరమన్నారు

డాక్టర్ హిమబిందు

రొయ్యల ఫ్యాక్టరీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు, మృతుడు శ్రీహరి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామం వద్ద రొయ్యల ఫ్యాక్టరీ బస్సు ఢీకొని మట్ట శ్రీహరి అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నెక్కంటి రొయ్యల ఫ్యాక్టరీకి చెందిన ప్రైవేట్ బస్సు కూలీలను దింపి సోమవారం రాత్రి 11 గంటల సమయంలో తిరుగు ప్రయాణమైంది. అతి వేగంగా వస్తున్న ఆ బస్సు ఇందుకూరుపేట వద్ద రోడ్డుపై వెళ్తున్న మట్ట శ్రీహరి అనే వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో శ్రీహరికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోతుంటే స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన శ్రీహరిని స్థానికులు 108 వాహనంలో రాజమండ్రిలోని ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం 8.50 గంటలకు మృతి చెందారు. సమాచారం అందుకున్న దేవీపట్నం ఎస్ఐ నాగర్జున ప్రమాదం స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. నెక్కంటి రొయ్యలు ఫ్యాక్టరీకి సంబంధించిన బస్సు డ్రైవర్లు అతివేగంగా నడుపుతున్నారని, దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని స్థానికులు చెప్పారు.

నేడు బీచ్రోడ్డులో చిరంజీవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- సీతమ్మధార : మెగాస్టార్ చిరంజీవి యూత్ విశాఖ జిల్లా శాఖ, ఉపకార ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు సంయుక్త ఆధ్వరంలో ఈ నెల 21న సాగరతీరంలో చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం స్థానికజనసేన పార్టీ కార్యాలయంలో వేడుకల పోస్టర్ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా తెలుగుశక్తి అధ్యక్షుడు బివి..రామ్, జనసేన వైద్య విభాగం అధ్యక్షుడు బొడ్డేపల్లి రఘు, కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ చిరంజీవి పుట్టిన రోజు వేడుకను పండుగలా నిర్వహించేందుకు చిరంజీవి యూత్ సన్నాహాలు చేయడం అభినందనీయమన్నారు. విశాఖ జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు ఎస్.ఎల్లాజీరావు మాట్లాడుతూ వేడుకలకు ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పంచకర్ల రమేష్బాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్రాజు, వివిధ పార్టీల నాయకులు అభిమానులు హాజరవుతారన్నారు.